A1TV NEWS


# ఆంధ్ర ప్రగతి

తెలుగు దినపత్రిక

సంచిక :01 సంపుటి : 56 శుక్రవారం - 25-ఆగస్ట్ - 2023 పేజీలు 4. వెల :4 /

# అధికారం అంటే అజమాయిషి చేయడం కాదు.

ఆంధ్ర ప్రగతి తాడేపల్లి ఆగస్టు 24:
దేవుని దయతో మరో మంచి కార్యక్రమానికి ఇక్కడ నుంచి శ్రీకారం చుడుతున్నాం. ఇంటింటా, మనిషి, మనిషికీ మంచి చేస్తున్న ప్రభుత్వం, అలా మంచి జరగాలని తాపత్రయపడుతున్న ప్రభుత్వం మనది. ఎక్కడా లంచాలకు తావులేకుండా, వివక్షకు ఏమాత్రం చోటు ఇవ్వకుండా, కులం, మతం, ప్రాంతం చూడకుండా.. చివరికి ఏ రాజకీయ పార్టీ అన్న ప్రస్తావన చూడకుండా.. మనకు ఓటు వేయకపోయిన ఫర్వాలేదు, అర్హత ఉంటే కచ్చితంగా అందించాలి, ఏ ఒక్కరూ మిస్ కాకూడదు అన్న తపన, తాపత్రయంతో అడుగులు వేస్తున్న పాలనే.. ఈ నవరత్నాల పాలనే.
ఏ పథకంలోనైనా అర్హత ఉండి, ఏ కారణంతో అయినా అందాల్సిన మంచి అందకపోయిన పరిస్థితులు ఉంటే.. అలాంటి వారికి న్యాయం చేస్తూ.. మంచి చేయడానికి మరోక్కసారి అవకాశం ఇస్తున్నాం. ఏ కారణం చేత అయినా ఆ రోజు మీకు అందకపోయి ఉంటే కంగారు పడకుండా మరలా



మీరు దరఖాస్తు పెట్టుకొండి, పథకం వచ్చిన నెలరోజుల వరకూ మీకు అవకాశం ఇస్తున్నాం. మరలా వెరిఫికేషన్ చేయించి... మీకు ఆ పథకం వచ్చేట్టు మిమ్మల్ని చేయిపట్టుకుని నడిపించే కార్యక్రమం ప్రభుత్వం చేస్తుంది అన్న మాట ప్రకారం ఇవాళ ఆ లెఫ్ట్ ఓవర్ బెనిఫిషియర్స్ కోసం ఈ కార్యక్రమం జరుగుతోంది.
అధికారం అంటే ప్రజల పట్ల మమకారం చూపడం. అధికారం అంటే ప్రజలకు మంచి చేయడం కోసం నాలుగు అడుగులు ముందుకువేసే బాధ్యత అని మరొక్కసారి ఆ బాధ్యతను తల్చుకుంటూ.. గత ఆరునెలలుగా వివిధ కారణాల వల్ల వివిధ పథకాలకు సంబంధించి అందుకోలేని 2.62 లక్షల మంది అర్హులైన లబ్ధిదారులకు మరలా రీ వెరిఫికేషన్ చేసి వారికి అవకాశం కల్పిస్తున్నాం. రూ.216 కోట్లు నేరుగా బటన్ నొక్కి అక్కచెల్లెమ్మలు, వారి కుటుంబసభ్యుల ఖాతాల్లో జమ చేస్తున్నాం.

మిగతాది 2లో...



# బ్రిక్స్ లో మరిన్ని దేశాలకు సభ్యత్వం కల్పించాలని నిర్ణయించాం: ప్రధాని మోదీ

దక్షిణాఫ్రికాలోని జొహాన్నెస్ బర్గ్ నగరంలో రెండ్రోజుల పాటు జరిగిన బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌతాఫ్రికా) దేశాల సదస్సు ముగిసింది. దీనిపై భారత ప్రధాని నరేంద్ర మోదీ ట్విట్టర్ లో స్పందించారు.
15వ వార్షిక బ్రిక్స్ సమావేశం సందర్భంగా కీలక నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. ఈ కూటమిని మరింత విస్తరించాలన్న అభిప్రాయానికి ఆమోదం లభించిందని తెలిపారు. బ్రిక్స్ విస్తరణకు భారత్ ఎల్లప్పుడూ అనుకూలమేనని మోదీ స్పష్టం చేశారు. ఈ విస్తరణ వల్ల బ్రిక్స్ మరింత బలోపేతం అవుతుందని, ఎక్కువ ప్రభావవంతంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ స్ఫూర్తితోనే అర్జెంటీనా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈలను బ్రిక్స్ లోకి భారత్ ఆహ్వానిస్తోందని ప్రధాని మోదీ వివరించారు.

# ప్లానింగ్ సెక్రెటరీలను బిల్డింగ్ ఇన్స్పెక్టర్లుగా ఆదేశాలు.

-పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వ నిర్ణయం.
- రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆదేశాలు అమలు.
-నంద్యాల మున్సిపాలిటీ నుండి నలుగురికి అవకాశం.



ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 24:
రాష్ట్ర ప్రభుత్వం అర్హత కల్గిన ప్లానింగ్ సెక్రెటరీ లకు గుడ్ న్యూస్ తెలిపింది.రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్, మున్సిపాలిటీలలో టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారులకు పని భారం అధికమైంది.టౌన్ ప్లానింగ్ లో ఖాళీలు అధికంగా వుండడంతో ప్రస్తుతం పని చేస్తున్న అధికారులకు పని భారం అధికమైంది.వైయస్సార్ ప్రభుత్వంలో మున్సిపాలిటీ లో పని భారం తగ్గించడానికి సచివాలయాలు ఏర్పాటు చేసి ఎందరో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ప్రభుత్వం అందించింది.సచివాలయంలో చేరిన ఉద్యోగులకు మొదట్లో 15 వేలు జీతాలు ఇచ్చింది.రెండవ ఏడాది వారిని రెగ్యులర్ చేసి 30 వేలు జీతాలు ప్రకటించడంతో ఉద్యోగులు ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం సచివాలయం లో పని చేస్తున్న ప్లానింగ్ సెక్రటరి లకు తీపి కబురు చెప్పింది.కార్పొరేషన్,మున్సిపాలిటీ ల్లో పని చేస్తున్న ప్లానింగ్ సెక్రెటరీ ల్లో అర్హత కల్గిన నలుగురికి బిల్డింగ్ ఇన్స్పెక్టర్ గా తీసుకోవచ్చని ప్రభుత్వం జీఓ ఇచ్చింది.నంద్యాలలో 42 వార్డుల్లో 42 మంది ప్లానింగ్ సెక్రెటరీ లు పని చేస్తున్నారు.నేతలు,అధికారులు 42 మందిలో ఆ నలుగురు అదృష్టవంతులు ఎవరో తెలియాల్సివుంది.నేతలు,అధికారులు ఆలస్యం చేయకుండా నలుగురికి అవకాశం కల్పిస్తే ఆక్రమణలు నివరిస్తు ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది.ప్రభుత్వం నిన్న జీఓ ఇవ్వడంతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో పని భారం తగ్గించుకోవడానికి,ప్రభుత్వానికి ఆదాయం కోసం ఇప్పటికే కొందరిని నియమించేందుకు సిద్దమైనట్లు




తెలుస్తుంది.నంద్యాల మున్సిపల్ టౌన్ ప్లానింగ్ లో ఆ అదృష్టవంతులు ఎవరో.

# మరో బిఆర్ఎస్ ఎమ్మెల్యేపై అనర్హత

- గద్వాల ఎమ్మెల్యే తప్పుడు అఫిడవిట్పై విచారణ
- డికె అరుణను ఎమ్మెల్యేగా ప్రకటించిన హైకోర్టు



హైదరాబాద్,ఆగస్ట్24 :
తెలంగాణలో మరో ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపడింది. గద్వాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి తెలంగాణ హైకోర్ట్ గురువారం అనర్హత వేటు వేసింది. తప్పుడు అఫిడవిట్ సమర్పించారని రుజువవ్వడంతో ఈ నిర్ణయం తీసుకుంది. కృష్ణమోహన్ రెడ్డి ఎన్నికల చెల్లదని తీర్పు ఇచ్చింది. కృష్ణమోహన్ రెడ్డి ఎన్నికల చెల్లదని తీర్పు ఇచ్చింది. తప్పుడు అఫిడవిట్ ఇచ్చారని వేటువేసింది. రూ.3 లక్షల జరిమానా కూడా విధించింది. 2018 ఎన్నికల్లో కృష్ణమోహన్ రెడ్డి తర్వాతి స్థానంలో ఉన్న డీకే అరుణను ఎమ్మెల్యేగా గుర్తించాలని ప్రకటించింది.

# టీవీఎస్ బైక్ షోరూమ్‌లో మంటలు

- కాలిబూడిదయిన 500 వెహికల్స్

విజయవాడ,అగస్టు24 :
విజయవాడలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. గురువారం ఉదయం 5 గంటలకు నగరంలోని స్టెల్లా కాలేజీ సమీపంలో ఉన్న టీవీఎస్ బైక్ షోరూమ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో షో రూమ్‌లో ఉన్న 500లకుపైగా ఎలక్ట్రిక్ పెట్రోల్ వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. క్రమంగా అవి షోరూంతోపాటు సర్వీసింగ్ షెడ్ కు కూడా వ్యాపించడంతో భారీగా మంటలు ఎగసిపడ్డాయి. దీంతో ఆ ప్రాంతంలో దట్టంగా పొగలు కమ్ముకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపుచేస్తున్నారు. అయితే అప్పటికే షో రూమ్ మొత్తం దగ్ధమయింది. షోరూమ్‌లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. కాగా, ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని అధికారులు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసే నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఉదయం 5 గంటల సమయంలో అగ్నిప్రమాదం జరిగిందని వాచ్ మెన్ ఫోన్ చేశాడని షోరూం యజమాని సతీష్ చెప్పారు. షో రూమ్‌లో 500 కొత్త ద్విచక్ర వాహనాలు ఉన్నాయని, షోరూం వెనకున్న సర్వీస్ సెంటర్‌లో 150 వరకు బైకులు ఉన్నాయని పేర్కొన్నారు. సర్వీస్ వాహనాలు, కొత్త వాహనాలు కలిపి మొత్తం రూ.8 కోట్లకుపైగా నష్టం వాటిల్లిందని చెప్పారు. కొత్త వాహనాలకు ఇన్సూరెన్స్ పూర్తిగా వస్తుందని తెలిపారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.ం



# అధికారం అంటే అజమాయిషి చేయడం కాదు.- సీఎం జగన్

కొత్త ఫించన్, బియ్యం, ఆరోగ్యశ్రీకార్డులు సైతం మంజూరు...

అంతే కాకుండా... ఈ ఆరునెలల పీరియడ్‌లో కొత్తగా ఫించన్ కార్డులు, బియ్యం కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు, ఇళ్ల స్థలాలకు సంబంధించి కూడా కొత్తగా దరఖాస్తు పెట్టుకుంటే... వీటి వెరిఫికేషన్ కూడా పూర్తి చేసుకుని.. వాటిని మంజూరు చేసే కార్యక్రమం కూడా ఇవాళ జరుగుతుంది.

కొత్తగా మరో 1,49,875 మందికి పెన్షన్లు కూడా మంజూరు చేస్తున్నాం. వచ్చే నెల నుంచి వీరికి పెన్షన్లు కూడా అందుతాయి. అదే విధంగా 2,00,312 మందికి కొత్తగా బియ్యం కార్డులు మంజూరు చేస్తున్నాం. వీరికి వచ్చే నెల నుంచి రేషన్ అందుతుంది. అదే మాదిరిగా 4,327 మంది ఆరోగ్యశ్రీ కార్డులు, 12,069 మందికి ఇళ్ల స్థలాలు కూడా ఇస్తున్నాం.

64.27 లక్షల పెన్షన్‌లు.....

పెన్షన్‌లకు సంబంధించి 1,49,875 మందికి కొత్తగా పెన్షన్‌లు ఇవ్వడంతో.. రాష్ట్రంలో మొత్తం పెన్షన్ల సంఖ్య దాదాపుగా 64.27 లక్షలకు చేరుకుంది.

గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు ఆరు నెలల మందు వరకు అంటే అక్టోబరు 2018 వరకు కేవలం 39 లక్షలు మాత్రమే ఉంటే... ఈ రోజు పెన్షన్ల సంఖ్య 64.27 లక్షలకు పెరిగింది. అప్పట్లో ఎన్నికలకు రెండు నెలల ముందు వరకు అంటే 4 సంవత్సరాల పది నెలల కాలం కేవలం రూ.1000 మాత్రమే ఇస్తున్న పరిస్థితి ఉంటే.. ఇవాళ రూ.2750 పెన్షన్ ఇస్తున్నాం.

ఇప్పుడు కొత్తగా మంజూరు చేసిన 2,00,312 కార్డులతో కలుపుకుంటే.. మొత్తం బియ్యం కార్డుల సంఖ్య 1,48,12,934కు పెరిగింది. అదే విధంగా ఇవాళ కొత్తగా మంజూరు చేస్తున్న 4,327 ఆరోగ్యశ్రీ కార్డులతో కలుపుకుంటే... ఆరోగ్యశ్రీ కార్డుల సంఖ్య కూడా 1,42,15,820 కు చేరింది. అలాగే ఈ రోజు మంజూరు చేస్తున్న ఇళ్ల పట్టాలు 12,069 కలుపుకుంటే... మొత్తం ఇళ్ల పట్టాల సంఖ్య 30,84,935కు చేరుతుంది.

వివిధ పథకాలకు సంబంధించి గత ఆరునెలల్లో అర్హత ఉండి వివిధ కారణాల వల్ల మిగిలిపోయిన ఈ 2.62 లక్షల మందికి ఇవాళ మరలా అవకాశం కల్పిస్తూ.. మంజూరు చేస్తున్నాం.

జగనన్న చేదోడు కార్యక్రమం ద్వారా 43,170 మందికి మరలా బెనిఫిట్ ఇస్తున్నాం. 207 మందికి వైఎస్ఆర్ మత్స్యకార భరోసా అందిస్తున్నాం. వివిధ సాంకేతిక కారణాల వల్ల గతంలో సున్నావడ్డీ పంటరుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ అందని 1,08,000 మంది రైతులకు .. సాంకేతక అంశాలను సరిదిద్ది నేడు వారికి అందిస్తున్నాం. జగనన్న విద్యాదీవెనలో మరో 32,770 మంది తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. జగనన్న వసతి దీవెన ద్వారా 36,898 మంది తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. వైయస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా 8,753 మందికి, 267 మందికి వైయస్సార్ నేతన్న నేస్తం కింద, జగనన్న అమ్మఒడి కింద 16,717 మందికి ... మొత్తంగా 2.62 లక్షల మందికి వివిధ కారణాల వల్ల ఆయా పథకాలు అందలేకపోయిన వారికి అందరికీ మరలా అవకాశం ఇచ్చి ఆ పథకాలను అందిస్తున్నాం. జగనన్న సురక్ష%--% 94,62,184 మందికిసర్టిఫికేట్లు

వీటితో పాటు ఈ మధ్య కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, ప్రతి ఇంటికీ వెళ్లి... జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వివిధ పథకాలకు అర్హులైన వారెవరూ మిగిలిపోకూడదన్న తపనతో జగనన్న సురక్ష చేపట్టాం. ఇందులో భాగంగా 94,62,184 మందికి రకరకాల సర్టిఫికేట్లు ఇవ్వడంతో పాటు.. ఇలా ప్రతి ఇంటికి వెళ్లినప్పుడు 12,405 మంది అర్హులై ఉండి వివిధ కారణాల వల్ల మిగిలిపోయిన వారికి కూడా లబ్ధి చేకూర్చున్నాం.

జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా... కాల్ సెంటర్‌కు ఫోన్ చేసిన 1630 మంది కూడా అర్హులని తేలడంతో వారికి కూడా మంచి జరిగించే కార్యక్రమం చేస్తున్నాం. ఏ ఒక్కరూ అర్హత ఉండి మిస్ కాకూడదన్న తపన, తాపత్రయంతో ఇవాళ వీరందరికీ మంచి చేసే కార్యక్రమం ఇవాళ జరుగుతుంది.

దేవుడి దయతో వీళ్లందరికీ ఇంకా మంచి జరిగే పరిస్థితి రావాలని, దేవుడు మంచి చేసే అవకాశం ఇవ్వాలని మనసారా కోరుకుంటున్నాను అని సీఎం ప్రసంగం ముగించారు

# గోరుకల్లు రిజర్వాయర్ పై తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలి. -సిపిఐ

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 24:

గోరుకల్లు రిజర్వాయర్. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణ, నిర్వహణపై పలు అనుమానాలు ఉన్నాయని వెంటనే ప్రభుత్వ యంత్రాంగం గోరుకలు రిజర్వాయర్ పై తక్షణ రక్షణ చర్యలు చేపట్టి ప్రజలకు భయాందోళన నుండి కాపాడే ప్రయత్నం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శిఎన్.రంగనాయుడు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి. ఎస్. బాబా ఫక్రుద్దీన్. ఒక ప్రకటన లో డిమాండ్ చేసారు ఈ సందర్బంగా పై నాయకులు మాట్లాడు తూ గోరుకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లో 261.5 మీటర్ల గరిష్ట స్థాయిలో 12.44 టి.ఎం.సీ. లో నీటిని నిలువ ఉంచడానికి డిజైన్ చేసారు. రిజర్వాయర్లో నీటిని నింపే గరిష్ట స్థాయి పైన నీటి అలల తాకిడిని తట్టుకునే వెసులుబాటు కోసం రిజర్వాయర్ బండ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అందుకోసం రిజర్వాయర్ ను 265.6 మీటర్ల స్థాయిలో రివిట్మెంట్ తో కూడిన బండ్ నిర్మాణం చేపట్టడానికి ప్రాజెక్టు డిజైన్ చేసారని కానీ రిజర్వాయర్ బండ్ నిర్మాణం అసంపూర్తిగా 261 మీటర్ల వరకు మాత్రమే పాలకులు చేసారని ఆయన తెలిపారు. గోరుకల్లు ప్రాజెక్టు పరిరక్షణకు మిగిలిన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయవలసి ఉన్నప్పటికీ, ఆ నిర్మాణ పనులను జి.వో. నెం 365 తేది 8.7.2020 ద్వారా నిలుపుదల చేయడమే కాకుండా మరి 5 సంవత్సరాల వరకు నిర్మాణాలు చేపట్టకుండా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని దుర్మార్గమైన చర్య అని అన్నారు.



రిజర్వాయర్ పనులను పూర్తి చేయకుండా, రిజర్వాయర్ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వకుండా రిజర్వాయర్ లో 10. 82 టి ఎం సీ ల నీటిని 257.84 మీటర్ల ఎత్తులో గత సంవత్సరం డిసెంబర్ లో నిలిపారని తెలిపారు. రిజర్వాయర్ బండ్ నిర్మాణం పూర్తి చేయకుండా, రిజర్వాయర్ అలల తాకిడిని పరిగణనలోకి తీసుకోకుండా ఈ స్థాయిలో నీటిని నిలువ చేయడం వలననే రిజర్వాయర్ బండ్ 60 మీటర్ల మేర 250 మీటర్ల నుండి 240 మీటర్లకు రివిట్మెంట్ జారిందన్న భావన రాయలసీమ సమాజంలో నెలకొని ఉంది. దీనితో రిజర్వాయర్ భవిష్యత్తు ఆందోళనకరంగా మారిందని అన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ కోసము స్థానిక ప్రజలు తమ పొలాలు సైతం ప్రభుత్వానికి అప్పగించిందని కానీ ప్రభుత్వం సాంకేతికంగా నీటిని నిలువ చేయకూడని స్థాయిలో రిజర్వాయర్ లో నీటిని నింపడంలో రిజర్వాయర్ భద్రతను విస్మరించి, రాయలసీమ వాసులకు పూర్తిగా నీరందిస్తున్నామనే ప్రచారానికే పాలకులు ప్రాధాన్యతను ఇచ్చినట్లుగా గొప్పలు చెప్పుకుంటుందని విమర్శించారు.

పై అంశాలపై ప్రభుత్వం సమగ్ర సాంకేతిక నివేదికను విడుదల చేయాలని అదే సందర్భంలో ఈ ప్రాజెక్టు మరమ్మతులకు సాంకేతిక నిపుణులు పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించి, తక్షణమే పనులు మొదలు పెట్టాలని, పూర్తి స్థాయి బండ్ నిర్మాణం తక్షణమే చేపట్టాలని పై నాయకులు డిమాండ్ చేసారు.

# కలెక్టరేట్లో జేకేసి మానిటరింగ్ సెల్ అండ్ కమాండ్ కంట్రోల్ రూమ్ ప్రారంభం.

## -జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సమూన్

ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు 24:

జగనన్నకు చెబుదాం – స్పందన ఫిర్యాదుల సత్వర పరిష్కారం కోసం కలెక్టరేట్లో జేకేసి మానిటరింగ్ సెల్ అండ్ కమాండ్ కంట్రోల్ రూమ్ ప్రారంబిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సమూన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్లోని డిఆర్ఓ ఛాంబర్ కారిడార్ లో జేకేసి మానిటరింగ్ సెల్ అండ్ కమాండ్ కంట్రోల్ రూమ్ ను జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సమూన్, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డిలు ప్రారంభించారు. జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డిఆర్ఓ పుల్లయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సమూన్ మాట్లాడుతూ అన్ని శాఖల స్పందన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి సంబంధించి మానిటరింగ్ చేసేందుకు కమాండ్ కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశామన్నారు. స్పందన ద్వారా స్వీకరించిన ప్రతి అర్జీని 24 గంటల లోపల స్పందన పోర్టల్ లో పరిశీలించి నిర్ణీతకాల పరిమితిలోగా పరిష్కరించేందుకు వీలుగా సంబంధిత అధికారులతో మానిటరింగ్ చేసేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.



అలాగే గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన పనులు.. పురోగతి అంశాలు, జగనన్నకు చెబుదాం – స్పందన పరిష్కారాలపై ప్రజల సంతృప్తి, అసంతృప్తులు, జిల్లాలో చేపడుతున్న వివిధ రకాల సర్వేలు తదితర అంశాలపై సమాచారాన్ని సేకరించినందుకు కమాండ్ కంట్రోల్ రూమ్ దోహదపడుతుందన్నారు ఇందులో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అడిషనల్ కోఆర్డినేటర్లు, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది తదితరులు నిత్యం పర్యవేక్షిస్తుంటారని కలెక్టర్ వివరించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ఓవరాల్ ఇన్చార్జిగా జిల్లా పరిషత్ డిప్యూటీ సీఎం సీఈఓ వ్యవహరిస్తారని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

# జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి.!

-జర్నలిస్టులపై దాడులు పికిపంద చర్య.

-వాస్తవాలను ప్రజలకు ,సమాజానికి తెలియజేస్తున్నారనే వంకర బుద్ధితో దాడులు.! రామినేని రాజునాయుడు.!

ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ వామపక్ష పార్టీ రాష్ట్ర కార్యదర్శి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 24:



రాష్ట్రంలో జరుగుతున్న జర్నలిస్టులపై దాడులను నిరసిస్తూ , నంద్యాల జిల్లా మహానంది మండలంలో ఇద్దరు పాత్రికేయ సోదరులపై వాస్తవాలు ప్రచురించారని అకారణంగా కొంతమంది దాడులు చేయడం అప్రజాస్వామ్యమనీ అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ (ఏ.ఐ.ఎఫ్.బి) రాష్ట్ర కార్యదర్శి రామినేని రాజునాయుడు అన్నారు.

గురువారం నాడు నంద్యాల జిల్లా కేంద్రం కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టులకు బాసటగా , జర్నలిస్టులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేఖంగా (ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్) యూనియన్ ఆధ్వర్యంలో 3వ రోజు జర్నలిస్టులు చేస్తున్న నిరాహార దీక్షలకు సంపూర్ణ మద్దతు తెలిపి రాజునాయుడు ప్రసంగించారు.

# విజయవంతమైన మిషన్ చంద్రయాన్ 3లో నంద్యాల జిల్లా వాసులు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 24:





నంద్యాలజిల్లా,ఆత్మకూరు మండలానికి చెందిన ఇద్దరు సైంటిస్టులను వారి తల్లి తండ్రులు... పట్టణవాసులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన సింహాద్రి రాహుల్, కిష్టాపురం గ్రామానికి చెందిన మానస అనే శాస్ర వేత్తలు గత ఏడేళ్లుగా ఇస్రో లో (భారత్ అంతరీక్ష పరిశోధన కేద్రం )లో పనిచేస్తున్నారు.ఇస్రో శాస్రవేతలు చేపట్టిన చంద్రయాన్ 3 విజయవంతం కావటంతో యావత్ భారత్ గర్విస్తున్న సందర్భంలో మిషన్ చంద్రాయాన్ 3లో ఆత్మకూరు యువత పాలుపంచుకోవటం పై తల్లితండ్రులు, పట్టణవాసుల హర్షం వ్యక్తం చేస్తున్నారు..

# చెంచుల అభివృద్ధికి సమగ్ర సర్వే.




ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 24:

కల్లెక్టరేట్లోని వైఎస్ఆర్ సెంటినరీ హా లు నందు ఐ.టి.డి.ఏ. శ్రీశైలం పరిధిలో నంద్యాల జిల్లా లలోని చెంచు గిరిజన గూడెంలలో చెంచు గిరిజనుల మౌలిక వసతుల సర్వే పై నంద్యాల జిల్లాలలోని ఐ.టి.డి.ఏ. శ్రీశైలం పరిధిలోని మొత్తం 14 మండలాల ఎంపీడీవోలు మరియు సచివాలయ సిబ్బంది వెల్ఫేర్అసిస్టెంట్ లతో సమీక్షా సమావేశము.ఈ సందర్భంగా డా%××%బి.రవీంద్ర రెడ్డి ప్రాజెక్ట్ అధికారి ఐ.టి.డి.ఏ.(పి.టి.జి. %--%చెంచు) శ్రీశైలం వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా చెంచు గిరిజన గూడెంపి ఎం పి వీ టీజీ మిషన్స్ “(మౌలిక వసతులపై ఒక రోజు శిక్షణ) సమగ్ర సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు మరియు ఈ సర్వే త్వరితగతంగా ఆగస్టు నెల చివరి నాటికీ పూర్తి చేయాలని వారికి సూచించారు.ఈ సమావేశములోఏ.సురేష్ కుమార్ సహాయ ప్రాజెక్ట్ అధికారి(జనరల్) కె జీ నాయక్ పి ఎమ్ ఐ టి డి ఎ రవీంద్ర టి ఏ ఏఎన్ఆర్ఈజీఎస్ పాల్గొన్నారు.

# కృష్ణను అభినందించిన ఎమ్మెల్యే అబ్రహాం



అలాపూర్:–

చంద్రయాన్– 3 విజయవంతం అయినందున చంద్రయాన్ –3 జోగులాంబ గద్వాల జిల్లా,ఉండవెల్లి మండల కేంద్రానికి చెందిన మద్దిలేటి, లక్ష్మీ దేవి కుమారుడు కృష్ణ ను స్థానిక ఎమ్మెల్యే అబ్రహం చరవాణి ద్వారా అభినందించారు. ఈ సందర్భంగా గురువారం కృష్ణ నివాసానికి ఎమ్మెల్యే వెళ్లి అతని తల్లిదండ్రులను సన్మానించారు. విద్యార్థులు కృష్ణ ను ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు.


# చంద్రయాన్-3 విజయోత్సవ సంబరాలు

అయిజ:–

చంద్రయాన్ 3 విజయవంతం కావడం తో అయిజ మండలం లోని ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాలలో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. గురువారం ఉప్పల ఉన్నత పాఠశాలలో ఇస్రో ఆకారంలో విద్యార్థులు కూర్చొని వేడుకలు జరుపుకున్నారు.

# అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా లబ్ధి పొందని వారికి ద్వైవార్షిక నగదు మంజూరు.

**-జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్**




ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు24:
నవరత్నాలు ద్వారా వివిధ సంక్షేమపథకాలకు సంబంధించి డిసెంబరు 2022 నుంచి జూలై 2023 వరకు అర్హులై ఉండి ఏ కారణంచేతనైనా లబ్ధి పొందని వారికి ద్వైవార్షిక నగదు మంజూరు కింద జిల్లాలో 7,216 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రు.8.30 కోట్లు జమ చేశామని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ పేర్కొన్నారు.గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా లబ్ధి పొందని వారికి ద్వైవార్షిక నగదు మంజూరు కింద రాష్ట్రవ్యాప్తంగా 2,62,169 మంది అర్హులకు లబ్ధి చేకూరుస్తూ బటన్ నొక్కి వారి ఖాతాల్లో రూ.216.34 కోట్లు జమ చేసే బృహత్తర కార్యక్రమాన్ని లైవ్ ద్వారా జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్, మైనారిటీ సంక్షేమ అభివృద్ధి ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, మార్క్ ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, బెస్త సంక్షేమ సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, హస్తకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, డిఆర్డిఏ పీడి శ్రీధర్ రెడ్డి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, సంక్షేమ శాఖ డిడి చింతామణి తదితరులు వీక్షించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ వివిధ సంక్షేమ పథకాల కింద అర్హులై ఉండి ఏ కారణంచేతనైనా లబ్ధి పొందని వారికి ద్వైవార్షిక నగదు మంజూరు కింద జిల్లాలో 7,216 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రు.8.30 కోట్లు జమ చేశామన్నారు. ఇందులో వైయస్సార్ ఆసరా కింద 32 స్వయం సహాయక సంఘాలకు చెందిన 313 మంది లబ్ధిదారులకు 52.04 లక్షలు, జగనన్న వసతి దీవెన పథకం కింద 1,295 మంది లబ్ధిదారులకు రూ.1.17 కోట్లు, జగనన్న విద్యా దీవెన పథకం కింద 1,470 మంది లబ్ధిదారులకు రూ. 2.17 కోట్లు, అమ్మఒడి కార్యక్రమం కింద 629 మంది లబ్ధిదారులకు రూ.81.77 లక్షలు, జగనన్న చేదోడు కార్యక్రమం కింద 2,471 మంది లబ్ధిదారులకు రూ.2.47 కోట్లు, ఈ బీసీ నేస్తం కింద 337 మంది లబ్ధిదారులకు రూ.50.55 లక్షలు, వైయస్సార్ నేతన్న నేస్తం పథకం కింద 15 మంది లబ్ధిదారులకు రూ.3.60 లక్షలు, వైయస్సార్ రైతు భరోసా కింద కింద 686 మంది లబ్ధిదారులకు 59.37 లక్షలు వెరసి మొత్తం రు. 7,216 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రు.8.30 కోట్లు జమ చేశామని కలెక్టర్ వివరించారు.
ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తోన్న ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు చక్కగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా లబ్ధి అందని వారికి మరో అవకాశం కూడా ఇచ్చి మరీ ఏడాదికి రెండు పర్యాయాలు ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ చైర్మన్, మైనారిటీ సంక్షేమ అభివృద్ధి ప్రభుత్వ సలహాదారు, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్, హస్తకళల డైరెక్టర్ తదితరులు అర్హులైన లబ్ధిదారులకు చెక్కును అందజేశారు.

# ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 24:
నంద్యాల మండలములోని కానాల గ్రామము నందు జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావుమరియు ఈ పంట సాంకేతిక సహాయకులు అయూబ్ భాష మండల వ్యవసాయ అధికారి ప్రసాద రావుతో కలసి కానాల లో రైతులతో మాట్లాడుతూ ఈ పంట లో ప్రతి రైతు తమ పంటలను నమోదు చేసుకోవాలని రైతులకు తెలియజేశారు.ఈ పంటలో నమోదు చేసుకున్న కౌలు రైతులకు మాత్రమే ప్రభుత్వము ద్వారా వచ్చే పథకాలు అందుతాయని తెలియజేశారు. అలాగే వాస్తవ కౌలు దారుల పేరు మీద మరియు వాస్తవ నీటి వనరులు ఆధారము పై మాత్రమే పంట నమోదు చేయాలని వి ఏ ఏ లను ఆదేశించారు.అలాగే ఈ పంట నమోదు కార్యక్రమములో ఏదైనా సమస్య వస్తే వెంటనే జిల్లా కార్యాలయానికి సమాచారము అందించి సమస్యలను నివృత్తి చేసుకోవాలని తెలియజేయడం జరిగినది. అలాగే రైతు భరోసా కేంద్రానికి సంబందించిన రైతుల వివరములు, పంటల సాగు సరళి మరియు వరి కి ప్రత్యామ్నాయ పంటల గురించి రైతులతో చర్చించి రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులు దృష్టిలో వుంచుకొని ఇకపై వరి వేసే రైతులు కాలువలకు నీరు వచ్చే సమయాన్ని బట్టి వేసుకోవాలని లేకపోతే ప్రత్యామ్నాయ పంటలు గా జొన్న, మినుము వేసుకోవచ్చు అని రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమములో వ్యవసాయ విస్తరణ అధికారి మని మోహన్ రెడ్డి, వి ఏ ఏ పుష్ప లత మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.



# రైతులు నీటి లభ్యతను బట్టి పంటలు వేసుకోవాలి.



ఆంధ్ర ప్రగతి మహానంది ఆగస్టు 24:
రైతులు నీటి వనరుల లభ్యతను బట్టి పంటలను వేసుకోవాలని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ )ఏడిఏ సరళమ్మ పేర్కొన్నారు. మహానంది మండలం బొల్లవరం గ్రామంలో ఆమె రైతులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో గ్రామంలో వివిధ రకాల పంటలు ముఖ్యంగా వరి, మొక్కజొన్న, లిల్లీ పూలు, ఇతర కొన్ని మెట్ట పంటలను సాగు చేస్తున్నారని తెలిపారు. అయితే సరియైన యాజమాన్య పద్ధతులు మరియు ఆధునిక సాంకేతికతను జోడిస్తే మెరుగైన ఫలితాలు రైతులు పొందవచ్చని సూచించారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమై దాదాపు రెండు నెలలు పూర్తి అవుతున్న సరైన వర్షపాతం లేక భూగర్భ జలాలు అడుగంటాయని రైతులు వరికి బదులుగా ఇతర మెట్ట పంటలు సాగు చేస్తే నష్టాలనుండి గట్టు ఎక్కే అవకాశం ఉందని రైతులు ఆలోచించుకోవాలని కోరారు. రసాయనిక మరియు క్రిమిసంహారక మందులు పరిమితికి మించి వాడకం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో వాతావరణ కాలుష్యం తో పాటు భూమి కోల్పోతున్న సారవంతాన్ని రైతులు గుర్తించడం లేదన్నారు. సేంద్రియ ఎరువులు వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ఏవో చంద్రశేఖర్ రెడ్డి గ్రామ వ్యవసాయ శాఖ ఏఈఓ చంద్రశేఖర్ మరియు రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయాలి.



ఆంధ్ర ప్రగతి పాములపాడు ఆగస్టు 24:
పాములపాడు: ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలని బి.ఎస్.పి అసెంబ్లీ ఇంచార్జ్ లింగాల స్వాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .
గురువారం నంద్యాల జిల్లా పాములపాడు మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ నందు బిఎస్పీ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి లింగాల స్వాములు ఆధ్వర్యంలో రైతులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి అసెంబ్లీ ఇన్చార్జి లింగాల స్వాములు మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో సరైన వర్షాలు పడకపోవడంతో పంటలు ఎండిపోతూ రైతులు అల్లాడుతుంటే మరోవైపు రైతులకు అందించే విద్యుత్ కోత లతో ఇబ్బందుల గురి చేయడం తో రైతులను ఆదుకోలేని స్థితిలో ప్రభుత్వం ఉండడం సిగ్గు చేటని విమర్శించారు . రాష్ట్రంలో లక్షలాది ఎకరాలలో వర్షాధారంపై రైతుల పంటలు సాగు చేసుకుంటే మరి కొంతమంది రైతులు బోరు బావి కింద సాగు చేసుకునే పరిస్థితి ఉందన్నారు. ఒకవైపు వర్షాలు సమృద్ధిగా పడకపోవడం వల్ల వర్షా ఆధారంపై ఆధారపడిన రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు వేసవి కాలం లా తలపించే ఎండలతో బోరుబావి క్రింద పంటలు చేసుకున్న రైతులు ప్రతిరోజు నీరు పెట్టాల్సిన పరిస్థితి ఉందన్నా రు. ఈ క్రమంలోనే విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడడం వల్ల నష్టపోతున్నారని ప్రభుత్వానికి వీరి బాధలు పట్టవా అంటూ ప్రశ్నించారు. పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందని ఆత్మహత్యలు నివారించాలంటే రైతులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రైతు రుణమాఫీ చేసి కొత్త రుణాలు మంజూరు చేసి రైతన్నలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వందలాది రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు అబ్రహం జనసేన నాయకులు రాంభూపాల్ రజక సంఘం నాయకులు రామకృష్ణ వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# జగనన్న ప్రభుత్వంలోనే సంక్షేమం అభివృద్ధి.

**- ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి**



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 24:
జగనన్న ప్రభుత్వంలోనే రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు, ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 38వ వార్డు నందమూరి నగర్ లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వార్డ్ ఇంచార్జి టీవీ రమణ వార్డు కౌన్సిలర్ సావిత్రి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. అనంతరం ప్రజా సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పారావు చంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు సంక్షేమ పథకాలు ఇంటి వద్దకి రావడంతో సంతోషం వ్యక్తం చేస్తూ అలాగే నందమూరి నగర్ లో ఒక కుటుంబానికి అక్షరాల మూడు లక్షలు వైయస్సార్ విద్య దీవెన లబ్ధి పొందడంతో ఆ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మబ్బున్నిసా, ఆప్కో డైరెక్టర్ సుబ్బారాయుడు, ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి , వైసిపి నాయకులు అంకాలయ్య, బాబురావు, నరసింహారావు శెట్టి ,తిరుపతయ్య, జాకీర్ హుస్సేన్, అన్వర్ భాష, రామకృష్ణారెడ్డి, ప్రసాద్ రెడ్డి, పుల్లమ్మ, వెంకటస్వామి శెట్టి, ఆచారి, రాము, ఉమాకాంతయ్య ,బాబు ,చిరు, సోమశేఖర్ ,శివ ,గోరే ,ముర్తుజాచెన్నప్ప ,మరియు వార్డు సచివాలయ సిబ్బంది మరియు వాలంటరీలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# బన్నీకి జాతీయ ఉత్తమ నటుడు అవార్డు.

**-ఈ పురస్కారానికి ఎంపికైన తొలి తెలుగు హీరోగా బన్నీ రికార్డు. -అల్లు వారింట పండుగ వాతావరణం.**

**-భావోద్వేగాలకు లోనైన సుకుమార్. -చరిత్ర సృష్టించిన అల్లు అర్జున్... సుకుమార్.**





ఆంధ్ర ప్రగతి హైదరాబాదు ఆగస్టు 24:
టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ చరిత్ర సృష్టించారు. జాతీయ ఉత్తమ నటుడు అవార్డు అందుకున్న తొలి తెలుగు హీరోగా రికార్డు నెలకొల్పారు. పుష్ప చిత్రంలో నటనకు గాను అల్లు అర్జున్ ను విశిష్ట పురస్కారం వరించిన సంగతి తెలిసిందే. జాతీయ ఉత్తమ నటుడు అవార్డు ప్రకటన వెలువడగానే బన్నీ ఇంటి వద్ద పండుగ వాతావరణం నెలకొంది. దర్శకుడు సుకుమార్, నిర్మాతలు నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి తదితరులు అల్లు వారి ఇంటికి విచ్చేసి తమ హీరోకు శుభాకాంక్షలు తెలియజేశారు.
సుకుమార్ అయితే తీవ్ర భావోద్వేగాలకు లోనయ్యారు. అల్లు అర్జున్ ను గట్టిగా హత్తుకుని తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇరువురి ఆత్మీయత అక్కడున్న వారందరినీ ఆకట్టుకుంది. అందరూ కరతాళ ధ్వనులతో అల్లు అర్జున్, సుకుమార్ ద్వయాన్ని అభినందించారు. బన్నీ తండ్రి అల్లు అరవింద్, అర్ధాంగి స్నేహ కూడా ఈ సంబరాల్లో పాలుపంచుకున్నారు.
దీనికి సంబంధించిన వీడియోను చిత్రనిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ట్విట్టర్ లో పంచుకుంది.

# జర్నలిస్టులపై పెట్టిన

# అక్రమ కేసులు ఎత్తివేయాలి.

- మీడియా పై దాడి ప్రజాస్వామ్యం పై దాడి.
- జర్నలిస్టులపై దాడులు చేసి,అక్రమ కేసులు నమోదు చేయడం వైసీపీ సిగ్గుతో తలదించుకోవాలి.










ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 24:
నిజాలు రాసే జర్నలిస్టులపై దాడులు చేయడమే కాకుండా అక్రమ కేసులు బనాయించడం సిగ్గుచేటని సీనియర్ న్యాయవాది వేదుర్ల రామచంద్రరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, రాయలసీమ సాగునీటి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు బొజ్జ దశరథ రామి రెడ్డి అన్నారు. మహానంది వార్త రిపోర్టర్ మధుపై దాడి చేయడమే కాకుండా ఆయన పైన రాజ్ని స్టాఫ్ రిపోర్టర్ మధు పైన పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని మూడో రోజు కూడా రిలే నిరాహార దీక్షలకు దిగారు. మూడవరోజు వివిధ పార్టీల నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు.

వీరారెడ్డి పై రౌడీ షీట్ ఓపెన్ చేయాలి:

– ఎన్. రంగనాయుడు సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టులపై దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. జర్నలిస్టులపై దాడులు చేయడమే కాకుండా ఆక్రమి కేసులు బనాయించడం సిగ్గుచేటు అన్నారు. తప్పులు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న అవినీతిపరుల గురించి పత్రికల్లో వార్తలు రాస్తే ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. దాడులతో అక్రమ కేసులతో నిజాలను తొక్కిపెట్టలేరని, ఇలాంటి చర్యల వల్ల నేతలు తమ ఉనికిని కోల్పోవడమే అన్నారు. అధికారులు తక్షణమే స్పందించి జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, వార్త రిపోర్టర్ మధుప్రియ దాడి చేసిన వైసీపీ నేత వీరారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గతంలో అతనికి నేర చరిత్ర ఉన్నందువలన రద్దు చేయడంతో పాటు రౌడీషీట్ ఓపెన్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో మరింత ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

జర్నలిస్టులపై దాడి ప్రజాస్వామ్యం పై దాడే:

– జర్నలిస్టులపై దాడి చేయడం అంటే ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని సీనియర్ న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు అన్నారు. పాలకులు చేశా అవినీతి అక్రమాలను వెలుగులోకి తేవడం జర్నలిస్టుల విధి అని, నిజాలు నిర్భయంగా రాస్తే జీర్ణించుకోలేని నేతలు దాడులు చేయడం సిగ్గుచేటు అన్నారు. బాధ్యతగల నాయకత్వ స్థానంలో ఉండి ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సింది పోయి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం దుర్మార్గమన్నారు. ఇలాంటి నేతలు పాలించడానికి కూడా అనర్హులన్నారు. ప్రజల్లో ఇలాంటి వారికి తమ ఓటుతో బుద్ధి చెప్పి శాశ్వతంగా రాజకీయాలనుంచి సాగనంపాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టులకు తమ మద్దతు ఎప్పుడు ఉంటుందని, న్యాయ సేవలు అందించడానికి కూడా తమ ముందు ఉంటామని చెప్పారు.

దాడులు ప్రజాస్వామ్యానికి హానికరం:

భారత రాజ్యాంగంలో నాలుగో పిల్లలుగా ఉన్న మీడియాపై దాడి చేయడం అంటే ప్రజాస్వామ్యం పై దాడి చేయడమే అని రాయలసీమను సాగునీటి సంఘాల సమాఖ్య అధ్యక్షులు బొజ్జ దశరథ రామిరెడ్డి అన్నారు. రాజ్యాంగంలో ప్రతి ఒక్కరికి భావ ప్రకటన స్వేచ్ఛ ఉందని, సమాజంలో జరుగుతున్న అన్యాయాలు అక్రమాలు వెలికి తీసి ప్రజలకు తెలియచేపాల్సిన బాధ్యత పాలకుల దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందన్నారు. నిజాలు నిర్భయంగా రాసే జర్నలిస్టులపై నాయకులు ఇలా దాడి చేయడం అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమ కేసులు సిగ్గుచేటు అన్నారు. ఇది అధికార దుర్వినియోగం కిందికే వస్తుందని ఇలాంటివారు ప్రజలను పాలించడానికి అనార్హులని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా నాయకులు సిగ్గు తెచ్చుకొని అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని పలికారు. పోలీసులు కూడా అధికార పార్టీ నేతలు అడుగులకు మడుగులు ఎత్తకుండా నిజాయితీగా వ్యవహరించి వారి గౌరవాన్ని నిలుపుకోవాలని సూచించారు. తక్షణమే జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు ఏ పోరాటం చేసిన తమ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.

జర్నలిస్ట్ లపై దాడులు భారత రాజ్యాంగానికే గొడ్డలి పెట్టు , ఆర్టికల్ 19ను ఉల్లంఘించడం, భావ ప్రకటనా స్వేచ్ఛను కాలరాయడమే..కాబట్టి నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి సీనియర్ న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు అన్నారు.

నంద్యాల జిల్లా పాత్రికేయులపై పెట్టిన అక్రమకేసులకు నిరసనగా ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రీలే నిరాహార దీక్షలు మూడవ రోజుకు చేరుకున్నాయి.

జర్నలిస్టులపై దాడులు చేసి,అక్రమ కేసులు నమోదు చేయడం సిగ్గు చేటు అని

జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి అని సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. మూడవ రోజు దిక్షా శిభిరం ను ప్రారంభించారు.

దీక్షా శిబిరానికి చేరుకొని ఏపీయూడబ్ల్యూజే సంఘీభావం తెలిపారు. ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు.

వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అన్ని రంగాల పైన కేసులు నమోదు చేస్తుందని అన్నారు.

అఖిల పక్షం బృందంతో అటవీ భూములను సందర్శిస్తాం అన్నారు.

జర్నలిస్టులకు అండగా ఉంటాం. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు

బొజ్జ దశరథ రామ్ రెడ్డి:

మహానంది వార్తా రిపోర్టర్ మదు పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి. పోలీసులు అక్రమంగా బనాయించిన కేసులు వెంటనే ఎత్తివేయాలని సాగునీటి సాధనా సమితి సభ్యులు బొజ్జ దశరథ రామ్ రెడ్డి అన్నారు.

వీరారెడ్డి కి ప్రభుత్వం గన్ లైసెన్స్ రద్దు చేయాలి...

జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చలం బాబు:

మహానంది మండల వైసీపీ నాయకుడు వీరారెడ్డి కి ప్రభుత్వం ఇచ్చిన గన్ లైసెన్స్ రద్దు చేయాలని నంద్యాల జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు చలం బాబు డిమాండ్ చేశారు.

గన్ కల్చర్ పై కలెక్టర్, ఎస్పీ దృష్టి సారించాలి అన్నారు.

ప్రభుత్వం అర్హులైన వారికి మాత్రమే భద్రతాపరమైన గన్ లైసెన్స్ ఇవ్వాలని అన్నారు.

బుడగజంగాల నాయకులు:

మహానంది మండలంలో వైసిపి నాయకులు ప్రభుత్వ భూములు ఆక్రమించడం.. ప్రభుత్వ, అటవీ భూముల్లో అక్రమ ఎర్ర మట్టి తవ్వకాలు జరపడం పై చర్యలు తీసుకోవాలి అన్నారు.

జర్నలిస్టులు రాసిన వార్తల ఆధారంగా జిల్లా కలెక్టర్ చర్య తీసుకోవాలి అన్నారు.

జర్నిస్టులపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలన్నారు.

జర్నలిస్టుల వెంట బుడగ జంగాల నాయకులు ఎల్లవేళలా అండగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సండే శ్యాంసుందర్ లాల్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉస్మాన్ భాష, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు చలం బాబు, నేతలు రాజు, రాజ్ కుమార్, మధుసూదన్ గౌడ్, మధు, భాష, నాగమణి, రాణి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

